క్లుప్తంగా

తుని ఆర్పీలకు శిక్షణ ప్రారంభం



శిక్షణ ఇస్తున్న జయరాజ్

సామర్లకోట: తుని మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా రిసోర్సు పర్సన్లకు బుధవారం రెండు రోజుల శిక్షణను మెప్మా జిల్లా రిసోర్సు పర్సన్ ఎల్.జయరాజ్ ప్రారంభించారు. ఆర్పీలు తమ విధులను వేగంగా, సక్రమంగా నిర్వహించి ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి శిక్షణ దోహద పడుతుందన్నారు.

విద్యార్థులకు చెస్‌పై శిక్షణ



విద్యార్థులకు చెస్‌లో శిక్షణ ఇస్తున్న రాజేష్

సామర్లకోట: చెస్ నేర్చుకోవడం ద్వారా మెదడుకు పదును పెరుగుతుందని సీనియర్ చెస్ క్రీడాకారుడు యార్లగడ్డ రాజేష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఈ క్రీడలో శిక్షణ ఇచ్చారు. సీనియర్ ఉపాధ్యాయిని బుర్ర అరుణసూర్య వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వేసవి శిబిరానికి రత్నమణి అధ్యక్షత వహిస్తూ గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



మజ్జిగను పంపిణీ చేస్తున్న చిన్నారావు

కొత్తపల్లి: దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు అన్నారు. స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. దండా వెంకటరమణ, పద్మ దంపతులు చలివేంద్రానికి అవసరమైన మజ్జిగను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు వీరభద్రరావు, పడగా నరసింహమూర్తి, ఆంజనేయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు సత్కారం



వలంటీర్ చక్రవర్తిని సత్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

కొత్తపల్లి: కొండెవరానికి చెందిన గాది చక్రవర్తి ఒకటో సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల రైల్వే పరీక్షల్లో ఉత్తీర్ణుడై ట్రాక్‌మెన్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం ఆ గ్రామ సచివాలయంలో చక్రవర్తిని సత్కరించారు. వలంటీర్‌గా పని చేస్తూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో అతను ఎంతో కృషి చేశాడని ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాది గంగబాబులు కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి ముసలయ్య (బాబులు), మానుకొండ మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బందిలి సూరిబాబు పాల్గొన్నారు.

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా



బోల్తా పడిన ధాన్యం లోడు ట్రాక్టరు

సామర్లకోట: స్థానిక రైల్వే గేటు సమీపంలోని గోదావరి కాలువ వంతెన ఎదురుగా సామర్లకోట-కాకినాడ రోడ్డులో లోడ్ లారీ సాంకేతిక లోపంతో నిలచిపోయింది. దాంతో పోలీసులు కాకినాడ నుంచి వచ్చే వాహనాలను గోదావరి కాలువ వంతెన అప్రోచ్ రోడ్డు మీదుగా మళ్లించారు. మండల పరిధిలో పి.వేమవరం గ్రామంలోని ముగ్గురు రైతులకు చెందిన ధాన్యం లోడు వాలుతిమ్మాపురంలోని రైసు మిల్లుకు ట్రాక్టరు యజమాని ఎస్ సత్తిబాబు తీసుకువెళ్తున్నారు. వంతెన అప్రోచ్ నుంచి రోడ్డు ఎక్కే క్రమంలో ట్రాక్టరు అదుపు తప్పి బోల్తాపడింది. దాంతో డ్రైవరు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఒక వైపు రోడ్డుపై లారీ నిలిచిపోవడం, మరో వైపు ధాన్యం లోడ్ ట్రాక్టరు బొల్తా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మరో ట్రాక్టరులో ధాన్యం లోడ్ చేసి రైసు మిల్లుకు తరలించారు.

వేసవిలో విజ్ఞాన వీచికలు

- విద్యార్థుల్లో ఉత్సాహం నింపుతున్న పీసీసీ
- సృజనను వెలికితీస్తున్న నిపుణులైన బోధకులు
- ఏటా వేసవి శిబిరంలో 200 మందికి శిక్షణ
- వివిధ విద్యలను అభ్యసిస్తూ విద్యార్థుల కోలాహలం



చిన్నారులకు కరాటే శిక్షణ ఇస్తున్న సుధాకర్, పూజిత

పెద్దాపురం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ విశేష కృషి చేస్తోంది. వేసవి సెలవుల వల్ల పుస్తకాలు, చదువు దూరమయ్యే విద్యార్థులను ఆ ధ్యాస మరచిపోకుండా ఏటా వేసవి శిబిరాలు నిర్వహిస్తూ నెల రోజుల పాటు వివిధ అంశాల్లో నిపుణలతో శిక్షణ ఇస్తోంది. దీనిలో భాగంగానే గత ఏడాది వంద నుంచి 150 మందికి శిక్షణ ఇవ్వగా ఈ ఏడాది 200 నుంచి 250 మందికి ఉచితంగా వేసవి శిక్షణ ఇస్తోంది. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు చెట్ల నీడన వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థుల కోలాహలం మధ్య ఉత్సాహంగా శిక్షణ సాగుతోంది. బుధవారం విశాఖ కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా సుధాకర్, దుంగల పూజిత విద్యార్థులకు ఆత్మరక్షణలో భాగంగా కరాటేలో మెళకువలు నేర్పారు.



వ్యాసరచన, కథలు నేర్పుతున్న బోధకురాలు

ఆత్మరక్షణకు ఉపయోగం



సమ్మర్ క్యాంప్‌తో మాకు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతోంది. గణితంలో బేసిక్స్ బాగా నేర్పుతున్నారు. ఉదయం నేర్పించే కరాటే ఆసక్తిగా ఉంది. ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– యమున, 9వ తరగతి, పెద్దాపురం

కథలు రాయాలని ఉంది



నాకు కథలు అంటే చాలా ఇష్టం. కరాటే నేర్చుకోవాలని ఉండేది. వేసవి శిబిరంలో కరాటే శిక్షణ నన్ను మరింతో ఉత్సాహపరుస్తుంది. ఇప్పుడు కథలు రాయాలనే ఆసక్తి మరింత పెరగడమే కాకుండా రాయగలననే పూర్తి విశ్వాసం కలిగింది.

– చైతన్య శ్రీ, 8వ తరగతి, పెద్దాపురం

విజ్ఞానం, వినోదం, వికాసమే లక్ష్యం



వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోకుండా విద్యార్థుల ఆలోచనల్లో మార్పు తీసుకురావాలనేది మా ప్రయత్నం. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, వికాసం అందజేయడమే లక్ష్యంగా మా క్లబ్ వేసవి శిక్షణ రెండో ఏటా కొనసాగిస్తోంది. ప్రశ్నించడం ద్వారా మాత్రమే కొత్తకొత్త అంశాలను తెలుసుకోగలమని వివరించడమే తమ పీసీసీ ప్రధాన లక్ష్యం.

– రొంగల అరుణ్‌కుమార్, సమ్మర్ క్యాంప్ కో–ఆర్డినేటర్, పెద్దాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఎల్ఎన్ పురంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ఎల్ఎన్ పురంలో గడప గడపకూ..

పిఠాపురం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. పథకాల ద్వారా లబ్ధిదారులకు అందిన లబ్ధిని వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందన్నారు. ఇతర రాష్ట్రాలకు మనం ఆదర్శంగా ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందని అన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలన ప్రజల ముంగిటకు చేరిందన్నారు. గతంలో ఏ చిన్న పని కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దే గ్రామ సచివాలయాలు ఉండడంతో క్షణాల్లో పనులు చేయించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను రైతుల ముంగిటకే తీసుకువచ్చిందన్నారు. కౌలు రైతులకు సైతం అన్ని పథకాలు వర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్రస్తుత వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సర్పంచ్ పడాల ఏడుకొండలు, కర్రెడ్ల తాతీలు, దివిటీల వెంకటరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

- డ్వామా పీడీ వెంకటలక్ష్మి
- ముగిసిన ప్రజా సామాజిక వేదిక
- ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై తనిఖీ



సామాజిక వేదిక సభలో ప్రసంగిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పెద్దాపురం: ఉపాధి పనుల ప్రజా సామాజిక వేదిక బుధవారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వేదిక ఏపీఓ బి.రాజబాబు అధ్యక్షతన జరగ్గా, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్బీ పట్నం ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ మస్తర్లు విషయంలో తేడా చేయడంతో పాటు, అతనిపై గ్రామ బహిరంగ సభలో వచ్చిన ఫిర్యాదులపైన చర్చ జరిగింది. సుమారు రూ.80 వేల అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. పీడీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, రూ.80 వేలు రికవరీ చేస్తామన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా పథకాలు అమలు చేస్తున్న ఈ ప్రభుత్వంలో ఎవరు అవినీతికి పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం సామాజిక వేదిక నివేదికలను ఎస్ఆర్పీ నివేదిస్తూ 2022–23 ఏడాదికి పెద్దాపురం మండలంలోని 1343 పనులకు సుమారు రూ.పది కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఎంపీడీఓ హిమమహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

మేరీ లైఫ్-మేరా స్వచ్ఛ షహర్‌కు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

పెద్దాపురం: వచ్చే నెలలో నిర్వహించే పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో నిర్వహించే మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు కోరారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో బుధవారం సచివాలయ సిబ్బందితో కలసి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్యూస్ రీ సైకిల్ రీయూజ్ (ఆర్ఆర్ఆర్) పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహించే మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్‌కు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు కార్యక్రమం ఉటుందన్నారు. ఐదో తేదీన పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఉంటుందన్నారు. పుర ప్రజలు తమ తమ ఇళ్లలో పనికి రాని వస్తువులు (బట్టలు, చెప్పులు, పుస్తకాలు, ఆట్టలు, కాగితాలు) తదితర వస్తువులన్నీ తమ సమీపంలోని సచివాలయం వద్ద అందజేయాలని కోరారు. ఈ వస్తువులను రెడ్యూస్ రీ సైకిల్, రీ యూజ్ కార్యక్రమానికి అందజేసి సహకరించాలని వారు కోరారు.

బాధితులను ఆదుకుంటాం



బాధితులకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ఇటీవల అగ్ని ప్రమాదాలకు గురై ఇళ్లు కోల్పోయిన బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. ఆయన బుధవారం పిఠాపురం మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డులో ఇటీవల విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన ఏడిద సూర్యాకాంతం కుటుంబాన్ని పరామర్శించారు. వారికి నిత్యావసర వస్తువులు, నగదు అందజేశారు. 30వ వార్డుకు చెందిన ఆరుగుల సత్యవతి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన వారికి నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అగ్ని ప్రమాదాలకు గురై ఇళ్లు కోల్పోయిన బాధితులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా గృహ రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా రామయ్య, నాయకులు గండేపల్లి బాబీ, వజ్రపు వీరేష్, వజ్రపు బాబీ, బాలిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దొరబాబు
- 26వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని మహిళకు వివరిస్తున్న హౌసింగ్ ఛైర్మన్ దొరబాబు

పెద్దాపురం : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. 'గడప గడపకూ ప్రభుత్వం'లో భాగంగా బుధవారం పట్టణంలోని 13వ సచివాలయం పరిధి 26వ వార్డులో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బండారు వీరబాబు వార్డు కౌన్సిలర్ బొబ్బిలి వీర వెంకట దుర్గ, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ పేరిశెట్టి అంబిక, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపండి



సామర్లకోట బీబీఆర్‌హెచ్ స్కూల్ నుంచి సాగుతున్న ర్యాలీ

సామర్లకోట: విద్యార్హత కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బీబీఆర్ హెచ్ స్కూల్ పరిధిలో ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ర్యాలీని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ ప్రారంభించారు. పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి తల్లి దండ్రులను చైతన్యపరిచారు. బీఈడీ అర్హతతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉండటంతో పాటు, అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు బ్యాగ్, బూట్లు ఉచితంగా అందజేస్తూ పోషక విలువలతో కూడి మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం ద్వారా ఉపాధ్యాయుల సంఖ్య పెరిగి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలన్నారు.

కొడవలి కొండ భూముల సర్వే



భూముల సర్వేను పర్యవేక్షిస్తున్న అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలి సర్వే నంబరు 133–1లో ఉన్న తురకల కొండ భూములను కోర్టు ఆదేశాల మేరకు అధికారులు బుధవారం సర్వే చేశారు. ఇక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంపై స్థానిక రైతులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. తాము కొన్నేళ్లుగా కొండ భూములను సాగు చేసుకుని మొక్కల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నామని, ఆ భూముల్లో మైనింగ్‌కు అనుమతులు ఇవ్వరాదని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ భూములలో సమగ్ర సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఏఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ వెంకటరమణ, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, మైన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్వేయర్ కేదారేశ్వరరావుల ఆధ్వర్యంలో రెవెన్యూ, ఉద్యాన, మైన్స్, అటవీ తదితర శాఖల అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా 29.45 ఎకరాలకు గాను బుధవారం 21 ఎకరాల్లో సర్వే పూర్తి చేసిన అధికారులు ఆయా భూముల్లో ఉన్న చెట్లను గుర్తించారు. మిగిలిన భూములకు గురువారం సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. రైతుల నిరసన నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



పెద్దాపురం పీఎస్‌కు తనిఖీకి వచ్చిన ఎస్పీ సతీష్‌కుమార్

పెద్దాపురం: పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంట పాటు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. ఇటీవల ఆయన రెండో తేదీన పెద్దాపురం పీఎస్ తనిఖీకి వచ్చినప్పుడు నూతనంగా విధుల్లో చేరాక అవగాహన కోసం వచ్చినట్లు చెప్పారు. మళ్లీ 15 రోజుల్లో ఆకస్మిక తనిఖీ చేయడంతో ఇక్కడ జరుగుతున్న నేరాలపై సిబ్బందిపై విచారణకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై డీఎస్పీని వివరణ కోరగా సాధారణ విజిట్‌లో భాగంగానే పోలీసు స్టేషన్ తనిఖీకి వచ్చినట్లు తెలిపారు.


వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



వేదిక్ మ్యాథ్స్‌పై పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి టి.నళినీప్రియ అన్నారు. ఉప్పాడ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్‌పై పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ప్రారంభించి 10 రోజులు పూర్తయ్యిందని, రోజూ విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.

వేసవి శిబిరంలో యోగాభ్యాసం



గ్రంథాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: యోగా, ధ్యానం చేయడం ద్వారా ప్రతి విద్యార్థికి మానసికోల్లాసం వస్తుందని వైద్య శిబిరంలో ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం కరాటే, యోగాసనాలు నేర్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుకు ప్రోత్సాహకాలు ఇప్పించండి

పిఠాపురం: పట్టు గూళ్లకు ఇచ్చే ప్రోత్సాహక బకాయిలు వెంటనే విడుదల చేయించాలని గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పట్టు రైతులు బుధవారం పిఠాపురంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టు రైతులు మాట్లాడుతూ 2021–22వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ చేబ్రోలు సెక్టారులో రైతులకు రూ.2 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలు ప్రస్తుత ప్రభుత్వం రాగానే ఇప్పించారని, అలాగే ఈ బకాయిలు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, పలువురు పట్టు రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



సిలిండర్ నుంచి వచ్చే మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక అధికారి

సామర్లకోట: అగ్ని ప్రమాదాలపై ఎంపీడీఓలకు అవగాహన ఉండాలని అదనపు జిల్లా అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్ఓ) ఎం.శ్రీహరిజగన్నాథం అన్నారు. నూతనంగా ఎంపికైన ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను, అన్ని ప్రమాదాల నుంచి రక్షణపై శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ఎంపికైన 40 మంది ఎంపీడీఓలు ఈనెల ఒకటో తేదీ నుంచి విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో విపత్తుల నివారణ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



సూరాడపేటలో మత్స్యకార గృహాలను ముంచెత్తుతూ..



బీచ్ రోడ్డులో ఎగసి పడుతున్న అలలు

● మండు వేసవిలో అలజడి

కొత్తపల్లి: మండు వేసవిలో 'అల'జడి మొదలైంది.. సముద్రం ఉవ్వెత్తున్న ఎగసిపడుతోంది... రోడ్లూ, ఇళ్లనూ ముంచెత్తుతుంది.. ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. గత రెండు రోజులుగా సముద్రంలో అలల ఉధృతి అధికమైంది. దీంతో తీరప్రాంతం, ఉప్పాడ– కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతుంది. ఉప్పాడ గ్రామానికి రక్షణ గోడలా ఉన్న జియోట్యూబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో మత్స్యకార గృహాలు కోతకు గురవుతున్నాయి. తుపాన్ సమయంలో సంభవించే విధంగా సముద్రపు అలలు ఎగసి పడుతుండడంతో మత్స్యకారులు ఆందోళనకు చెందుతున్నారు. బీచ్ రోడ్డులో సముద్రపు అలలు ఎగసి పడుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.